క్లుప్తంగా

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా మహా రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

అగనంపూడి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని 79వ వార్డు అగనంపూడి జూబిలీ హిల్స్ ఆవరణలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా రుద్రాభిషేకం జరిపించారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు అభిషేకం కొనసాగింది. భక్తులు తెల్లవారు జాము నుంచి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు.

పారిశ్రామిక సందర్శనతో విజ్ఞానం



వీఎస్‌పీని సందర్శించిన విజ్ఞాన్ విద్యార్థులు

అగనంపూడి: విద్యార్థుల్లో నూతన ఒరవడులు, ఆలోచనా ధోరణులు మెరుగుపడడానికి పారిశ్రామిక, వాణిజ్య సందర్శనలు దోహదపడతాయని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. ఎంబీఏ విద్యార్థులు ఏపీ మెడ్‌టెక్ జోన్, మెడికల్ టెక్నాలజీ ఇన్ ఇండియా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లను సందర్శించారు. హెచ్‌వోడీ బి.చంద్ర, అధ్యాపకులు పట్నాయక్, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

8 నుంచి దివ్యాంగుల క్రికెట్ పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు లతీష్, ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ పోటీలను డిసెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తెలిపారు. శుక్రవారం ప్రతినిధులు ఆయన నివాసంలో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందుస్థాన్ జింక్ మైదానంలో జరిగే ఈ పోటీల్లో 10 జిల్లాల నుంచి 10 జట్లు పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్, టోర్నమెంట్ నిర్వాహకులు మణికంఠ, హేమ సుందర్, బలరామకృష్ణ, షేక్ హుస్సేన్, సూరిబాబు, నందన్ సాయి, బి.బాలకృష్ణ, ప్రవీణ్, కోదండం పాల్గొన్నారు.

శ్రీవారి అన్నప్రసాదానికి విరాళం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహించే శ్రీవారి అన్నప్రసాదానికి శుక్రవారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన గోవింద నామాల టీం ప్రతినిధులు రూ.11,111 దివ్యక్షేత్రం ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ప్రత్యేకంగా అభినందించారు.

కాలిబాట వంతెనలు కలేనా!

- రోడ్డు దాటాలంటే వణుకే
- 15 ఏళ్ల నుంచి ప్రతిపాదనల్లోనే..
- ప్రమాదాలు సంభవిస్తున్నా తప్పని నడక



ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 15 ఏళ్ల కిందట నిర్మించిన దిమ్మలు



పాతగాజువాక వద్ద హైవే పై రోడ్డు దాటుతున్న జనం

గాజువాక: పాతగాజువాకలో రోడ్డు దాటాలంటే పాదచారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. జాతీయ రహదారిపై అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్లే సమయంలో ఏ వాహనం తమపైకి దూసుకు వస్తుందోనన్న భయంతో ఆందోళన చెందుతున్నారు. రోడ్డు దాటడానికి కాలిబాట వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిర్మించాలని స్థానికులు ఏళ్ల తరబడి కోరుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించడంలేదు. ఫలితంగా పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి

పాతగాజువాక జంక్షన్ వద్ద జాతీయ రహదారిని దాటేందుకు కాలిబాట వంతెన (ఫుట్‌ఓవర్ బ్రిడ్జి) నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు 2009లో రూ.14లక్షలతో పనులు ప్రారంభించారు. 38వ బస్టాప్‌వద్ద రోడ్డుకు రెండు వైపులా పిల్లర్లు, కాంక్రీటు దిమ్మలు వేశారు. రెండు దశల్లో దీని నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. కాంక్రీటు దిమ్మలు, పిల్లర్లతో మొదటి దశ పనులకు శ్రీకారం చుట్టిన అధికారులు మిగిలిన పనుల కోసం అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. పనులు ప్రారంభించి 15 ఏళ్లు పూర్తి కావడంతో అక్కడి దిమ్మలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఉదయం..సాయంత్ర వేళ రద్దీ

ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోవడంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్డు దాటడానికి జనం నానా అవస్థలు పడుతున్నారు.జాతీయ రహదారిలో ఒకవైపు నుంచి మరో వైపు రావాలంటే నరక యాతన తప్పడంలేదు. ఇలాంటి ప్రయత్నంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్నవారు అనేకమంది ఉన్నారు. బస్సులతో పాటు ఆటోలు, ప్రైవేట్ వాహనాలు, రూట్ సర్వీసులు కూడా అధిక సంఖ్యలో బస్టాప్‌వద్దే ఆగుతుండడంతో జాతీయ రహదారిపై అడుగు తీసి అడుగు వేయడానికి వీలు పడడంలేదు. ఈ పరిస్థితుల్లో కాలిబాట వంతెన ఏర్పాటు చేస్తే తప్పా ఈ సమస్యకు పరిష్కారం లభించదని భావించిన అధికారులు ప్రారంభించిన పనిని కూడా మధ్యలో నిలిపివేయడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు.

అక్కడా అదే సమస్య

పాతగాజువాక జంక్షన్ దరి చైతన్యనగర్ మెయిన్ రోడ్ ఎదురుగా కూడా ఇదే సమస్య స్థానికులను భయపెడుతోంది. జాతీయ రహదారికి ఒక పక్క డ్రైవర్స్ కాలనీ మెయిన్ రోడ్డు, మరోపక్క చైతన్యనగర్ ఉన్నాయి. పెద్ద పెద్ద విద్యా సంస్థలన్నీ ఇక్కడే ఉన్నాయి. ఈ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వారిని తీసుకొచ్చే తల్లిదండ్రులు ఇక్కడ జాతీయ రహదారిని దాటడానికి నానా కష్టాలు పడుతున్నారు. చిన్నారులు స్కూళ్లకు వెళ్లే సమయంలోనే అందరూ విధులకు వెళ్లేందుకు హైవేపై రాకపోకలు సాగిస్తారు. దీంతో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఫార్మా బస్సులతో రోడ్డుపై ట్రాఫిక్ గందరగోళంగా మారుతుంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం బారిన పడే పరిస్థితి చోటుచేసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు ఎప్పట్నుంచో కోరుతున్నారు.

ప్రజల ఇబ్బందులు పట్టడంలేదు

ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు గాని పట్టడంలేదు. బ్రిడ్జి విషయంలో నాయకులు ఇచ్చిన హామీ నీటిమూటగానే మిగిలిపోయింది. పరిష్కార మార్గాన్ని నిర్ణయించిన తర్వాత కూడా నిర్లక్ష్యం ప్రదర్శించడం కంటే దారుణమైన విషయం మరొక్కటి ఉండదు.

– బి.వి.రామరాజు, డ్రైవర్స్ కాలనీ

భయంగా ఉంటుంది

మా ఇంటి నుంచి కిందకి దిగితే పాత గాజువాక జంక్షన్. హైవేపై అవతలి రోడ్డుకు వెళ్లాలంటే చాలా భయంగా ఉంటుంది. ఎంతసేపు ఆగి చూసినా వాహనాలు మాత్రం ఆగవు. ఏదో విధంగా ధైర్యం చేసి దాటుతుంటాం. ఈ సమస్యకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలి.

– దుర్గారావు, ఎల్విఎస్ నగర్

త్వరితగతిన పూర్తి చేయాలి

విశాఖ నగరంలోని చాలా ప్రాంతాలకంటే పాతగాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య ఎక్కువ. ఈ విషయాన్ని గుర్తించడం వల్లే అధికారులు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గతంలో శ్రీకారం చుట్టారు. అయితే దాన్ని పూర్తి చేయకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా ఆ పనులను త్వరిత గతిన పూర్తి చేస్తే బాగుంటుంది. చైతన్యనగర్‌వద్ద హైవేపై కూడా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉంది.

– గొలగాని నాయుడు, స్థానికుడు

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనలో ప్రసంగిస్తున్న శ్రీరామ్మూర్తి

గాజువాక: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. పుస్తక ప్రదర్శనలో చందమామ కథలు, అంకెలతో ఆటలు, బాలభారతం, బాల రామాయణం, పెద్ద బాలశిక్ష, భగవద్గీత, స్వేచ్ఛా విహంగం తదితర పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమాన్ని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుస్తకం మంచి మిత్రుడితో సమానమన్నారు. చరిత్రను చదివితేనే కొత్త చరిత్రను రాయగలమన్నారు. కార్యక్రమంలో ఆర్కా ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లపు నగేష్, గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పెదగంట్యాడ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో పాఠకులు ప్రదర్శనను తిలకించారు. అలాగే విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి సుమారు 156 మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.బాలప్రసాద్, మనోహర్, అలీ, కేజీ విజయ్‌కుమార్, పురుషోత్తమరావు పాల్గొన్నారు.

పోస్టుకార్డు ఉద్యమంలో అందరూ పాల్గొనాలి



పోస్టుకార్డు ఉద్యమంలో వైఎస్సార్‌టీయూ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న పోస్టుకార్డు ఉద్యమంలో ఉద్యోగులంతా పాల్గొనాలని స్టీల్ వైఎస్సార్‌టీయూ నాయకులు కోరారు. శుక్రవారం యూనియన్ పాయింట్ వద్ద నాయకులు, కార్యకర్తలు పోస్టుకార్డులపై సంతకాలు చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగాలనే ప్రజల ఆకాంక్షను ప్రధాని మోదీ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ, పిట్టారెడ్డి, చిత్రాడ బాలకృష్ణ, డి. పుల్లారావు, జి. అప్పలరెడ్డి, విజయకుమార్, దరిగి రవి, వి. అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



ఉక్కు బీసీ గేటు శివాలయంలో పూజల్లో భక్తులు



బాలచెరువు శివాలయంలో జ్వాలా తోరణం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని శివాలయాలు శుక్రవారం భక్తులతో పోటెత్తాయి. కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా భక్తులు ఉదయం నుంచి ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. సెక్టార్-6 శివాలయంలో భక్తులు తాకిడి ఎక్కువ కావడంతో బయట వరకు బారులు తీరారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు పూజలు చేశారు.సాయంత్రం జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. బీసీ గేటు సమీప ఉమా సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉమా రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం రుత్వికుల ఆధ్వర్యంలో హోమాలు చేశారు.

- రవీరేస్ సమీప పురాతన శివాలయంలో వేకువ జాము నుంచి పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కణితి, వడ్లపూడి కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

స్థానిక త్రిశక్తి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. సాయంత్రం ఆలయం ఆవరణలో చండీ హోమం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెదగంట్యాడ: మండలంలోని ఆలయాలు కార్తీక పౌర్ణమి శోభను సంతరించుకున్నాయి. ఇందులో భాగంగా ఆలయాల్లో దీపారాధనలు, కుంకుమార్చనలతో పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. 73వ వార్డు సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామం ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ ఆధ్వర్యంలో జ్వాలా తోరణం నిర్వహించారు.

పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జ్వాలా తోరణాన్ని వెలిగించారు. అలాగే జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని శివాలయంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఉమా రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ అర్చకుడు వాసుదేవ శర్మ అధ్యక్షతన జ్వాలాతోరణం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ కన్యక పరమేశ్వరి పంచాయతన ఆలయంలో కూడా జ్వాలాతోరణం నిర్వహించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులను అందజేస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక: విజయవాడ వరద ప్రాంతాల్లో సేవలు అందించిన జీవీఎంసీ 70వ వార్డు పారిశుధ్య కార్మికులకు ఆ వార్డు కార్పొరేటర్ ఉరికూటి చందు దుస్తులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల సేవలకు గుర్తుగా ప్రభుత్వం ఒక్కొక్కరికీ రెండు జతల దుస్తులు అందించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, సీఐటీయూ కార్యదర్శి గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన సాయి నామస్మరణ



సాయి నామ జపంలో భక్తులు



భజన చేస్తున్న భక్తులు

అగనంపూడి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని 85వ వార్డు అగనంపూడిలోని షిర్డీసాయి మందిరంలో భక్తిశ్రద్ధలతో ఏకాహం కొనసాగిస్తున్నారు. కార్తీక మాసంలో ప్రతీ ఏటా ఆలయం ఆవరణలో ఏకాహం జరిపిస్తుంటారు. ఈ ఏడాది శుక్రవారం ఉదయం ఆరు గంటల ఉంచి శనివారం ఉదయం వరకు ఏకాహం కొనసాగించారు. ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి నామ స్మరణలో భక్తులు తరించారు. అనకాపల్లి సమీపంలోని తుంపాల రామాలయ కమిటీ ప్రతినిధులు ఏకాహంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర భక్త మండలి, బొర్రమాంబ పారాయణ మహిళా బృందం, శివాలయ కమిటీ, సత్యసాయి భజనమండలి, షిర్డీసాయి భజన మండలి ప్రతినిధులు సాయి నామ స్మరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య రమణారెడ్డి, డి.వ్యాస శర్మ, జి.శంభుడు, పి.రామారావు, పీఎల్ఎన్ రాజు, సత్యనారాయణ, టోపీరాజు, సత్యలక్ష్మి, సత్యశ్రీదేవి, లీలావతి, పద్మావతి, రాజ్యలక్ష్మి పద్మ పాల్గొన్నారు.

పేద రైతులకు అండగా సహకార సంఘాలు



లంకెలపాలెం సహకార సంఘ కార్యదర్శి సత్యనారాయణను సత్కరిస్తున్న నాయకులు

అగనంపూడి: పేద, మధ్యతరగతి రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అండగా నిలుస్తున్నాయని లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి పాడిశెట్టి సత్యనారాయణ అన్నారు. అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా లంకెలపాలెం సహకార సంఘం ఆవరణలో సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సంఘాలు మరింత పుంజుకొనేలా చొరవ తీసుకోవాలన్నారు. హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బొండా అప్పారావు మాస్టార్ మాట్లాడుతూ స్థానికంగా సహకార సంఘానికి 25 సెంట్ల భూమి ఉన్నప్పటికీ అద్దె భవనంలో కొనసాగించడం సరికాదన్నారు.సొంత భవనం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, మాదాసు శ్రీనివాస్, దాసరి జయలక్ష్మి, గుదే గజేంద్రరావు, పూడి సత్యారావు, కట్టా పైడిరాజు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో దోమలకు చెక్



ఫ్రై డే- డ్రై డేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అక్కిరెడ్డిపాలెం: ఫ్రై డే- డ్రై డే పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంటమాలజిస్ట్ సబ్ యూనిట్ అధికారి డి.ఎస్.ఎన్.రాజు అన్నారు. 68వ వార్డు వెంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శుక్రవారం మలేరియా అధికారులు, సిబ్బంది మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను గుర్తించి వాటిలో దోమల లార్వా సంహార మందులను పిచికారీ చేశారు. వారానికి రెండుసార్లు నీటి ట్యాంకులను ఖాళీ చేసుకోవాలని మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డి.ఆనందరావు, హెల్త్ అసిస్టెంట్లు మురళీ కృష్ణ, కె.అప్పలరాజు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.


గిరిజనుల ముద్దుబిడ్డ బిర్సా ముండా



భెల్‌లో బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏజీఎం లీలా

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లోని అంబేడ్కర్ పార్క్‌లో శుక్రవారం భగవాన్ బిర్సా ముండా 149వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏజీఎం (హెచ్‌ఆర్) ఎస్.లీలా పాల్గొని బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జానపద నాయకుడు, బిహార్, ఝార్ఖండ్ అటవీ ప్రాంతాల్లో బ్రిటిష్ కాలంలో గిరిజనుల హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు అని కొనియాడారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కొల్లి దేముడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రతినిధులు బొండా బాబూరావు, సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, జి.టి.పి.ప్రకాష్, పి.విశ్వాసరావు, పి.వీరబాబు, టెక్కలి భాస్కరరావు, బి.ప్రశాంత్ కుమార్, బి.రవీంద్రబాబు, జి.కిరణ్, హెచ్.భోగేష్, బి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పడిపూజకు వేళాయె



ముస్తాబైన ఉక్కు అయ్యప్ప ఆలయం



ఆలయ ప్రవేశద్వారం



పడిపూజకు ముస్తాబైన ఉక్కు అయ్యప్ప ఆలయం

ఉక్కునగరం: అయ్యప్పస్వామి ఆలయాలు ఎన్ని ఉన్నా.. ఉక్కునగరం అయ్యప్ప ఆలయం ప్రత్యేకం. అక్కడి స్వామికి నిత్య పూజలు, పడి పూజ, జ్యోతి పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉక్కు స్టేడియం ఎదురుగా కేటాయించిన స్థలంలో భక్తులు, దాతల విరాళాలతో అత్యంత ఆధునికంగా అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. పూర్తిగా శబరిమలై అయ్యప్ప ఆలయం నమూనాతో నిర్మించిన ఈ ఆలయంలో అష్టాదశ దేవతలు (18 మెట్లు), ఉప దేవతలు, బలి పీఠాలకు, పరివార దేవతలకు చెందిన ఉప ఆలయాలు నిర్మించారు. శబరిమలై ఆలయం వెనుక ఉన్నట్టే ఈ ఆలయం వెనుక కూడా పొన్నాంబలై కొండ ఉండడం ఈ క్షేత్రం విశేషం. నవంబర్16 నుంచి డిసెంబర్ 27వరకు అయ్యప్ప మండల పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అయ్యప్ప ఆలయంలో శనివారం పెద్ద ఎత్తున పడిపూజ నిర్వహించనున్నారు. అనంతరం శ్రీను బృందంతో భజనలు ఏర్పాటు చేశారు. స్వాములు పడి పూజకు హాజరై అయ్యప్ప కృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రధానార్చకుడు నాగేశ్వర శర్మ కోరారు.

స్థల వివాదంలో ఇరువర్గాలపై కేసు

అక్కిరెడ్డిపాలెం: కణితి రోడ్డులోని మార్కెట్‌లో స్థలం విషయంలో నెలకొన్న వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ పార్థసారథి శుక్రవారం తెలిపారు. వివరాలు.. గాజువాక మార్కెట్‌లో రోడ్డు పక్క చిరువ్యాపారులు వివిధ రకాల వస్తువులు విక్రయిస్తారు. వీరివల్ల రోడ్డుపై ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో రోడ్డుపై నుంచి వెనక్కి జరిపారు. ఈ క్రమంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు చేసుకుంటూ విరుచుకుపడ్డారు. దాడులు చేసుకుంటున్న వారిని ఎంత ఆపాలని ప్రయత్నించినా వారు వినే పరిస్థితి లేకపోయింది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు దాడులకు పాల్పడిన ఇరు వర్గాల్లో 6 గురిపై కేసు నమోదు చేశారు.

మందుబాబులకు జైలు, జరిమానా

అక్కిరెడ్డిపాలెం: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించినట్టు గాజువాక ట్రాఫిక్ సీఐ పార్థసారథి తెలిపారు. శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా 10 మంది పట్టుబడ్డారన్నారు. వారిని 3వ ప్రత్యేక కోర్టు జడ్జి టి.వి.రమణ ఎదుట హాజరుపర్చగా వారిలో 8 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా, మిగిలిన ఇద్దరికి జైలు శిక్షతో పాటు రూ. 50 చొప్పున జరిమానా విధించినట్టు చెప్పారు.